# జాగ్రత్త పడవలసిన ఘట్టాలు

"బారెడు పొద్దెక్కిం దప్పుడే. ఊరివా రందరూ పాచీపనీ చేసేసుకున్నారు; కాని మాయింటో కోడే కుయ్యలే దింకా"

"........................"

"మొగుడాడు నాలుగ్గడియల రాత్రివేళే లేచిపోయినా, చద్దన్నాల వేళ దాకా గదిలోనుంచి యివతిలికే రాకపోతే యింకెలాగా వేగడం?"

"........................"

"లేవడానికి తొందర అక్కరలేదు, లేచీ లేవగనే కాఫీ కాచుకోడానికి మాత్రం వాకటే పరుగు. ముందు కుంపట్లో నిప్పపడేసే మొగంకడుక్కోడం. ఛీ, గేదీ తాగుతుంది, కుడితి"

"........................"

"రెక్కల్లో సత్తువ వుందికదా, చెయ్యక యేమిచేస్తుందని దిలాసా. అత్తముండలు బతికి వుండవలసిన రోజులు కావివి"

"........................"

"వాగివాగి అదే వూరుకుంటుం దని మొండితనం కూడాను. సిగ్గూ భిడియమూ, భక్తీ భయమూ లేనివాళ్ళ నెన్నంటే మాత్రం యేమి లాభమూ?"

"........................"

"రెండు గడియల పొద్దెక్కే దాకా పడుకుంటే నాకుమాత్రం సాగదా యేమిటి? అయితే, నీకయినాబుద్ధి లేదా అని నాకే గడ్డిపెడతారు లోకులు. మంచయినా చెడ్డయినా యింటి యజమానులకే గాని, మధ్య, సత్రకాయ పీనుగుల కేమి వుంటుందీ?"

"........................"

"ఒకటీ రెండూ కాదు, పదిహేడేళ్ళు వెలగబెట్టాను, కజ్జాకోరు అత్త గారి దగ్గిర కాపరం. కిక్కురుమని యెరగ నెప్పుడూను. తూర్పు తెల్లవారుతోం దనగా మొగం కడుక్కొని చీపురుకట్ట పుచ్చుకుంటే, జాము పొద్దెక్కేదాకా వాకటే తుడుపు, వంచిన నడుం యెత్తకుండా. ఇలా అయితే, ఆ కాలంలో మేము కాపరం కడతేర్చామే"

"........................"

"మనలాగే వైదీకంలో వున్నవాళ్ళ పిల్లని చూడమని యెన్ని విధాలా పోరినా, యిదేదో మంచి సంప్రదాయం అని మురిసిపోయారు గాని, నామాట చెవినిపెట్టారా? ఏమయినా, యీ మాలకూడు ముట్టకుండా బాగానే దాటారు. ఆమహారాజు ఇద్దరివంతూ నాపాలబడింది, ప్రారబ్ధకర్మం లాగ"

"........................"

"దానిల్లు మాయమైపోను, యీకొంపలో గాజులమలారం దింపడం యెప్పుడయినా వుందా? ఇంకో రెండు జతలు బంగారపువే చేయించుకోరాదూ, నాబ్రాహ్మణ్యం బుగ్గి చెయ్యాలన్న దుర్బుద్ధి కాకపోతే?"

"........................"

"రామారామా. వాకలి, అంతా వుల్లిపాయల పొట్టే నేను తుడవలేను బాబూ, నానా పెంటలూనా"

"........................"

నాచేత రోజూ గోమూత్రం తాగించా లని పట్టుదల. నన్నేడిపించే పీను గులు పుచ్చి పురుగు లోడిపోరూ?"

"........................"

"దేవుడు లేడా అంటే?"

"........................"

"వాకట్లో తుక్కుంటే గింజుకుంటాడు వాడు. పోనీ, యెక్కడ పడితే అక్కడ నానాగడ్డీ పడెయ్య వద్దని అవతలివాళ్ళకి గడ్డిపెడతాడా వొక్కమాటయినా?"

"......................"

"ముసిముసినవ్వులు నవ్వుతూ — అవన్నీ దొంగ వేషాలు, నాకు తెలియదూ? ఇంటికి వచ్చాటప్పటికి తక్కుతూ తారుతూ యెదటపడితే, యిక వొళ్ళు తెలిస్తేనా ఆనాగమ్మకి?"

"......................"

"మే మెరగమమ్మా యీ సాని టక్కులు, వాకట్లో మొగాడి కెదురుగా నుంచోడం—ఛీ, తలుచుకుంటేనే ప్రాణం చచ్చిపోతోంది"

"......................"

"సంసారిపీనుగులే యిలా అయితే, యిక బోగంవాళ్ళెందుకూ అడుక్కు పోవాలి గానీ?"

"......................"

"అమ్మయ్యా, రామయ్యతండ్రీ, నడుం పడిపోయిం దోయి నాయనా! అరవై యేళ్ళకే ముద్దచేసి మూల పడేస్తావా మహరాజా?"

"......................"

"ఇదీ వొకదారే. మూడు యజ్ఞాలు చేసింది రామసోదెమ్మ, చచ్చే ముందు, నాలుగుమాసాల పాటు మంచంపట్టి, అవి కిరస్తానీ నీళ్ళా, అది మాల కూడా, అవి యీసడింపులా — మహాప్రభో, పగవాళ్ళ కయినా వద్దలాంటివి. కిందపెట్టే దాకా వొకళ్ళచేత చాకిరీ చేయించుకునే దౌర్భాగ్యం నాకు పట్టనివ్వకు మా తండ్రీ?

## 2

"పాడు మొగం మంచం దిగాటప్పటికి తయారు, దిష్టి పిడతలాగ. ఇంత కంటే నల్లపిల్లి మొగం నయం"

"......................"

"నేను చీకటితోనే లేవకబోతే తన పుట్టేం మునిగిందీ? ఏచిన్నకథో, యేనవలో చదువుకుంటూనో కబుర్లు చెప్పుకుంటూనో మేము వొంటిగంట దాకా మేలుకుంటాం కనక, నాకు తెల్లవారుజామున గాఢనిద్ర పట్టిపోతుంది. నేను పెందలాడే లేవనందుకు వారికి లేని బాధ తన కెందుకూ?"

"......................"

"ఎవరినో ఆడిపోసుకుంటూ కూచోడమే కనక, తనకెప్పుడూ నిద్రే పట్టదు, తన కర్మం. నాకేం కళ్ళనిండా నిద్రపోకుండా యేడవడానికి?"

"...................... ......................"

"చాకిరీ చేసుకుంటే గాని సాగనివాళ్ళూ, తనలాంటి దరిద్రగొట్టు మనుషులూ లేస్తారు, తెల్లవారకుండానూ, నాకర్మం యేమి కాలిందీ?"

"......................"

"తెల్లవారకుండా లేస్తుందని గోదావరికి వెళ్ళి స్నానం చెయ్యడమూ, రామాకృష్ణా అనుకుంటూ కూచోడమూ? ఎంతసేపూ, యెవరినో చూసి వోర్చ లేకపోవడమూ, యెవరినో దెప్పడమూ, యెవరినో సాధించడమూ—— ఇంతే బతుకు. ఎప్పుడూ వంకరబుద్ధే. ఛీ, పాడిదీ బయలుదేరుతుంది చీకటితోనే చీపురు పుచ్చుకుని"

"......................"

"మానమనా, అభిమానమనా? బోలెడు జీతం పుచ్చుకునే దాసీది వుండగా తన కెందుకా పుణికింతాలూ? తాను చేస్తే నేను కూడా చెయ్యకపోతానా, చెయ్యకపోతే నోరంటాలు పెట్టవచ్చుగదా, యిదీ యేడుపు! మొగం నేలబెట్టి యీడిపిస్తాను గానీ, వాకలి తుడుస్తానేం నేను?"

"......................"

"కాఫీకోసం నేను కుంపటి అంటించాటప్పకి లబోలబో అంటూ బయలు దేరుతుంది గదా, అదేం పుట్టుకో గాని! నేను పుచ్చుకుంటున్నందుకు గింజు కోకపోతే తన కాయోగం లేనందు కేడవరాదూ?"

"......................"

"మామయ్యగా రెప్పుడయినా నోరు చేసుకుని అడిగేవారు పాపం, కాని వొక్కమాటూ కూడా కాఫీ యిచ్చి యెరగ దీ యిల్లాలు. ఎంతసేపూ, యే కారం రాసిన అటుకులో యిన్ని మొగాన కొట్టి, చెంబెడు మంచినీళ్ళు తాగ మనేది, సరసం తెలిస్తేనా?"

"...................... ......................"

"ఓమాటు ఆ విసిరికొట్టడం చూసి, నాకోసం చేసుకున్న కాఫీపట్టుకు వెళ్ళి యివ్వగా యెంత సంబరపడ్డారు పాపం ఆయన, కానియెంత రగడ పెంచిందీ ఆవేళ? మరిచిపోతానా, యీ జన్మలో"

"......................"

"నిజంగా చచ్చే సుఖపడ్డా రాయన. ఆయన నవ్వుతూ మాట చెప్పవస్తే

ధుమధుమ లాడుతూ అందుకునే దీవిడ. ఆ పాడు మొగాన నవ్వే కనపడదమ్మా, అదేం పుట్టుకోగానీ"

"....................."

"మా తిండికోసం గోల పెట్టవద్దని యెన్నిమాట్లయినా గడ్డిపెట్టారు మామయ్యగారు; కాని వింటేనా? నల్లరాయి కానీ, మనిషా యేమిటి?"

"....................."

"మేము నాటకానికయినా సినిమాకయినా వెడితే కళ్ళల్లో నిప్పులుపోసు కుంటుంది. వీధిభాగవతాలూ తోలుబొమ్మలూ అయితే, తాను పరుగెత్తవచ్చు. పాపం"

"....................."

"కొడుకు విస్తరిలో కాస్త మీగడ వేస్తే కళ్ళు చిమచిమలాడిపోతాయి, నేను కాఫీపుచ్చుకుంటే కళ్ళల్లో కారం చల్లుకోడం అబ్బరమా?"

"....................."

"గోచీపెట్టి బట్ట కట్టుకుంటే "కోమటివేషాలు - మేం యెరగం బాబూ" అంటూ గుర్రాలకళ్ళలాగ మొగం తిప్పుకుంటుంది. గూడకట్టు కట్టుకుంటే "బోగంపాప" లంటూ వూళ్ళోవాళ్ళని కూడా దీవిస్తుంది, దినమంతా. కాకపోతే నూర్లూ నూటయాభైలూ పోసి కొనుక్కున్న పట్టుచీరలు మడికచ్చాపోసి కట్టుకోనా?

"....................."

"శిఖచుట్టుకుంటే వోర్చలేదుగదా? ముడి వేసుకుంటే చూడలేదుగదా? తలలో పువ్వులు ముడుచుకుంటే గుడ్లు మిటకరించుకుంటుంది గదా, యిక నేనీ దెయ్యాన్ని పెద్దచేస్తానేం?"

"....................."

"కొడుకు కావాలన్నా కూర చెయ్యదు గదా, యెన్నడూ? నేను మడి కట్టుకుని వసారా పొయిలో నిప్పు వెయ్యనినాడు వారి కుపవాసమే గదా?"

"....................."

"మెడలో రుద్రాక్షతావళం వేసుకుంటేనే వస్తుందా యేమిటి యెత్తుకు పోడానికి విమానం? నన్నూ నావంటివాళ్ళనూ తిట్టే తిట్లు లెక్కపెట్టుకోడానికి గాని జపం చేసుకోడానికా యేమిటి అపూసలు?"

"....................."

"ఈపాటికి నీళ్ళు మరిగిపోతాయి. ఈరాకాసి సోరంటాలకు విరుగుడు అంటూ లేదు. హాయిగా కాఫీపుచ్చుకుని నిన్నచేసిన ఖర్చులు పద్దురాసుకోకుండా

యీదిక్కుమాలిన గొడవ యేమిటి నాకు? రైతులకు రాసిన వుత్తరాలకు నకళ్ళు కూడా రాయాలింకా. బాబోయ్, అప్పుడే ఆరున్నర అయిపోయింది, వచ్చేస్తున్నారో, వచ్చేవేశారో? వారు పొడిబట్టలు కట్టుకుని తల దువ్వుకునే టప్పటికి కాఫీకప్పు నోటికందించే దానికి, యివాళ, నాకింత బద్ధకం వచ్చిం దేమిటమ్మా?"

## 3

"ఇంత చెమట పట్టిందే యివాళ?"

"ఫాల్గునమాసం జొరబడింది ఆశ్చర్యమా? కాకపోయినా, వేడివేడి కాఫీ పుచ్చుకున్నది మొదలు తిరగడమే ఆయె, పట్టిన చెమట ఆరడాని కిక్క అవకాశం యేదీ?"

"చొక్కా తీసెయ్యండి విసురుతాను"

"నీకంత దయే వుంటే, చొక్కా వుండగానే బాగుంటుంది"

"అయితే, కండువా___"

"......................"

"నేను తియ్యగూడదూ?"

"నేను తియ్యకపోతేగా?"

"చూస్తూ నుంచోనా నేను?"

"నువ్వు కండువా జాగ్రత్తచేసి వచ్చేదాకా వూదుకుంటూ కూచోనా నేను?"

"బాగానే వుంది"

"ఇంకేం?"

"......................"

"కొంచెం నింపాదిగా"

"......................"

"ఇంకా కొంచెం"

". ..................... ఏం"

"గట్టిగా విసిరితే నీకు చేతులు లాగుతాయి. పైగా, నీకు చెమటపడు తుంది. నాకు నువ్వూ, నీకు నేనూ___"

"ఊరుకోండి"

"తప్పేం?"

"తప్పా, తప్పున్నరా?"

"అందం అంటూ వుంటే, అందులోనే వుంది, తెలుసుకోగలిగితే"

"అ—వ్వ—"

"అయితే చూడూ. పొలమూరినుంచి రామదీక్షితులు మామయ్యగారు వచ్చారు"

"ఏరీ?"

"బజారు పని చూసుకుని పదింటికి వస్తాడు"

"భోజనం యిక్కడేనా?"

"ఆహా"

"అయితే, పంట అయిపోతోంది, అరటికాయ పప్పులో వేసినట్టుంది మీ అమ్మ, బాగుంటుందా?"

"బంగాళాదుంపలు వేయించు నువ్వు వెళ్ళి"

"......................."

"వెళ్ళమరీ"

"ఒళ్ళు కాస్త ఆరనిస్తారా?"

"ఆయనకు ప్రొద్దుపోదూ?"

"క్షణం"

"కాఫీ పుచ్చుకోకుండా బయలుదేరి వుండరు గానీ—"

"ఫలహారం చెయ్యరా?"

"చెయ్యరూ? ఎవరు చెప్పారు?"

"ఇంకేం? కాకపోయినా, పదిగంటలంటే పల్లెటూరివారి కాలస్యం కాదు లెండి"

"మీగడ యేమయినా వుందేమో?"

"సరే, మీకే వుంచదు గదా మీఅమ్మ?"

"దానిగుణం అది పోనిచ్చుకోదు, ఏం చెయ్యం?"

"......................."

"అప్పుడే అందుకుంది చూశారా? ఈ గోడ పక్కని నక్కిందండీ మీరింట్లోకి రావడం చూసి. మీర్రూ నేనూ యింటో వుంటే పొంచుండి వింటుందండీ, వొక్క మాటు—"

"ఊరుకో"

"నేనూరుకోలే నండి"

"......................."

"చూశారా, చూశారా? నన్నిలా తిట్టిపోస్తూ వుంటే—"

"ఇప్పటిదాకా చూపించిన మంచి అంతా యేమయిపోయిందీ?"

"మంచీ మంటిగడ్డలూను. మంచివాళ్ళకి మంచిగాని, మంకు మనుషుల కూనా? ముక్కుకి, మసి రాసుకుని అలాగ మీదిమీదికి వస్తూ వుంటే - ఏం, ఎంచేతా? ఎందు కూరుకోవాలీ? నీకుందా భయం? నీకుందా సిగ్గూయెగ్గూను?

"అమ్మా"

"అమ్మా బొమ్మాను. అలా రెచ్చిపోతూ వుంటే చచ్చు పెద్దమ్మ లాగ చూస్తూ వూరుకుని, నాకోసం యేడుస్తా వేమిట్రా నీబుద్ధి బుగ్గిగాను? నువ్వు మొగాడవు కావుట్రా?"

"నీసిగ్గు చిమడాలి. నీబుద్ధి బూడిద కావాలి. ఆడదానివే నువ్వు? తల్లివే నువ్వు? దేవుడులాంటి కొడుకు నిలా తిట్టే మనిషి—"

"నువ్వు పెళ్ళానివే? నిక్షేపం వంటి నాకొడుక్కి మందులు పోసి, వాడి బుద్ధి విరిచేసి, నామాట వినకుండా చేసి —"

"నీ మాట యేమి వినడంలేదమ్మా నేను?"

"ఏమి విన్నావు నాయనా? దాన్ని అణచగలిగావా? దానికి భయ భక్తులు చెప్పగలిగావా?"

"నువ్వణిగావా, యిన్నేళ్ళు వచ్చాయిగాని? నీకు భయభక్తు లున్నాయా నాకు లేకపోవడానికి? నోరు లేనిదాన్ని చేసి—"

"నీకే నోరు లేకపోతే? రాకాసి లాగ అలా మీద పడిపోతున్నావు, నీకే వాయి లేకపోతే?"

"నీకంటేనా; నీకళ్ళకి నేను రాకాసిలావున్నానా? దెయ్యపుకళ్ళు, పిచా చపునోరు—"

"ఊరుకోవూ?"

"గడ్డం పట్టుకుని పెళ్ళాంపీనుగుని బతిమాలుకుంటావుట్రా? వోరి నీబతుకు—"

"పోనీ, నువ్వూరుకోమ్మా, నీకాళ్ళు పట్టుకుంటాను"

"దాన్ని లొంగతియ్యలేవు గాని నన్నాజ్ఞపెట్టవస్తావా? పెళ్ళాంగారిమాట విని తల్లిని లోకువచేస్తావుట్రా?"

"నువ్వే లోకువ? నువ్వే తీసికట్టు? హయ్యో, నీకు మొండివా డయినా జవాబు చెప్పగలడా?"

"నువ్వు నంగనాచివా? నువ్వు—"

"మొగుణ్ణేమేసి తెగనరికావు, కొడుకు లెక్కా నీకు?"

"మొగుణ్ణి వాజమ్మని చేసి కూచోపెట్టావు, అత్తగారు లెక్కా నీకు?"

"అమ్మా, రామదీక్షితులు మామయ్యగారు వచ్చారు. మన యింటికి వచ్చే వేళ అయింది. నా మర్యాద తక్కనియ్యవూ?"

"రామదీక్షితులు వస్తే నాకు భయమా, గోవిందదీక్షితులు వస్తే నాకు భయమా? తేరతిళ్ళు తినేవాళ్ళని లక్ష్యపెడతానేం నేను?"

"తేరతిళ్ళకోసం వస్తున్నారా బాబుగారు? ఊరుకుంటారేమండీ యింకానూ?"

"ఊరుకోకపోతే వురిపెట్టుకోమను. కాదంటే నువ్వు పెట్టు. నిన్నెవ ళ్ళేమి చేయ్యగలరూ? కుక్కనిసేనునిచేసి కూచో బెట్టావు, వురిపెట్టడానికి నీకేం అడ్డూ?"

"అమ్మా, నన్నేమన్నా సంతోషమే గాని యింటికి వచ్చే పెద్ద మనిషిని—"

"పెద్దమనిషంటే? ఎలాంటి పెద్దమనిషిరా రామదీక్షితులు? నెలకి నాలు గయిదు రోజులు నెత్తెక్కి కూచునేవాడు పెద్దమనిషి అంటే యేమన్న మాట రా?"

"అయ్యో అయ్యో యీమాటలు, బాబుగారువింటే యింకేమన్నావుందా? నలుగురిలోనూ తల యెత్తుకోగలమా?"

"నీకే వుంది మహామర్యాద. నీకే వుంది గౌరవం. నీకే మోసింది యింటిబాధ్యత అంతా"

"దానిది కాదు, నీదే బాధ్యత. అయితే, అది నిర్వహించుకోడం యిలా గేనా?"

"ఇలాగేనా అంటే, మరెలాగ? నేను పప్పుకూరా చారూ చేసి వుంచితే, మళ్ళీ తను బంగాళాదుంపలు వేయించడమా? నేను కొంతవడ్డనా తను కొంత వడ్డనానా?"

"శిస్తులకోసం పోలమూరు వెడితే పదేసిరోజు లుంటున్నాను వారి యింటో. నన్ను మనుగుడుపు పెళ్ళికొడుకుని చూసినట్టు చూస్తారు వారందరూ? పప్పుకూరటమ్మా ఆయనకు వడ్డించడం?"

"పల్లెటూళ్ళ వాళ్ళకది మాత్రం యెలా వస్తుంది? కాకపోయినా, రెండో మనిషి వడ్డనలోకి వస్తే నాకు మర్యాదా యేదింక?

"పోనీ, బంగాళాదుంపలు నువ్వు వేయిస్తావా?"

"వేయించవద్దూ మరీ నీసెలవయాక? ఇవాళ కన్ను తెరిచిన పీనుగువు,

నువ్వు చెబితే, నామడి మట్టిగడ్డ లయినా, నానిష్ఠ నీళ్ళు కారిపోయినా చేతులు కట్టుకుని చెయ్యవద్దూ నేను? అయ్యో నాదశ"

"అదండీ యేడుపు. మీరు చెప్పినట్టు చేస్తే యిక తన పెత్తనం యేదీ అనీ. చూశారా?"

"ఏమిటే చూసేది వాడూ నువ్వూను? చూసేం చెయ్యగలరే నన్ను మీరు? వాణ్ణి మహాపూసుకువస్తున్నావు గానీ, నీవల్ల యే మవుతుందే అసలు?"

"ఏమవుతుందా? ఏమి చెయ్యగలనా?"

"ఊరుకోనువ్వు.................అమ్మా"

"ఏం, ఎందుకురా అమ్మ?"

"నీహద్దులో నువ్వుంటావా, నీమాటా నామాటా కూడా దక్కుతుంది. లేకపోతే, లోకంతో పాటే, తెలిసిందా?"

"ఏమిట్రా తెలిసేది?"

"ఏమిటా? నేను చెప్పాలా?"

"...................."

"వీధిని పడితే అది నా కొక్కడికే కాదు, తలవంపులు, నీఅధికారం యెంతవరకో, అసలు నీప్రమేయం యెంత మాత్రమో గుర్తించుకోడం లేదు నువ్వు. నీకు తోచకపోతే, యెవరి నయినా అడుగు, చెబుతారు"

"నాకు చెప్పగలవా శ్శైవఝ్ఝురా యీ రాజమహేంద్రవరంలో?"

"తాతయ్యగారు పోయాక నాయనమ్మ మాట యేమయింది?"

"నేను చెబుతాను వినండి. అప్పుడు తనకి పెత్తనం వచ్చింది. ఇవతలి వాళ్ళకి మాత్రం అలా రాకూడదు."

"నేను రానివ్వను. నేను బతికివుండగా నాయింటో___"

"నీయిల్లు? దొడ్డిగుమ్మంమీద కొంజా వేయించా నెందుకో తెలుసా?"

"అమ్మా, నువ్వు దానికి అత్తగారి వయితే అదిచుట్టరికంలోనే, వ్యవహారంలో కాదు. నాన్నగారు బతికివుండినంత కాలమూ నీపెత్తనం సాగింది. నువ్వేమన్నా చెల్లింది"

"ఇప్పుడు మాత్రం యెందుకు సాగదూ?"

"నేను సాగనియ్యను కనక?"

"అలాగేం?"

"అక్షరాలాను?"

"నువ్వూరుకో. తెలిసిందా అమ్మా? ఇక నువ్వే తప్పించుకు తిరగాలి.

నీమర్యాదా నిలవా లన్నా, మా మర్యాదా నిలవాలన్నా నువ్వీ పద్ధతి కట్టిపెట్టాలి నా వీలుచాళ్ళనుబట్టి మసులుకోవాలి యింటోవాళ్ళు. నీకది యిష్టం లేకపోతే నీకున్నగోడు నిలవదు"

"నిలవక?"

"గంగలో కలుస్తుంది"

"నన్ను గంగలో కలుపుతావుటా?"

"ఇక పెడర్థాలు కట్టిపెట్టు. ఏమంటావ్? నా చెప్పుచేతల్లో వుంటావా వుండవా?"

"పెళ్ళాంపీనుగు చెప్పినట్టల్లా—"

"నాన్నగారు చూపించిన దారే నా కది"

"..................."

"ఏం, యేమంటావ్?"

"నేను బతికివుండినంతకాలమూ పెత్తనం నాది కాని మరివొకళ్ళది కాదు. ఒకళ్ళు నన్నేమీ చెయ్యలేరు. అయిన వాళ్ళూ కానివాళ్ళూ నాయింటో పెత్తనం చేస్తే నేను సహించలేను"

"అది బాగా నిశ్చయించుకున్న మాటేనా?"

"ఏమయితే నీ కేం?"

"నే నడిగినదానికి బదులు చెప్పాలి"

"నేను చెప్పను, నన్ను నిలవతీసి అడగడానికి నీకేం అధికారం వుందీ?"

"నా అధికారం చూపించనా?"

"తొందరపడకండీ"

"నువ్వుండు. ఏమమ్మా, యేమంటావ్"

"..................."

"ఏం?"

". . . . . . . . . ."

"నాసంగతి నీకు తెలుసు. నేను మాట అంటే తిరగను సుమా"

"నేనూ తిరగను"

"కనక?"

". . . . . . . . . ."

"తిరగక?....ఏమి చేస్తావ్?"

"..................."

"ఒద్దుసుమండీ! నన్ను చంపుకుని తిన్నట్టే నేనే ఓపిక పడతాను. అల్లరి చెయ్యకండి"

"ఏమమ్మా?"

". . . . . . . . . ."

"ఈపూటతో వంటలు వేరు. పద మడికట్టుకో"

"అయ్యో, అయ్యో, నామాట—"

"మడికట్టుకుంటావా లేదా?"

"అంత కోపం వస్తే యెలాగండీ!"

"నోరెత్తవద్దు"

"నే నేం చేతునమ్మా?"

"నేనేం చేతునమ్మా యేమి టింకా? నసాళం అంటేదాకా తిర్రిపెట్టావు, ఏమీ యెరగనట్టు నటిస్తున్నావు. ఎంత దానివే నీమొగం మండ? ఎంత పని చెయించావే నీవాళ్ళు యిదయిపోనూ. వోరి చెవలవాజమ్మా, నువ్విక సంసారం చెయ్యగలవా? నా పెత్తనం తప్పించి నువ్వు ముందుకి వస్తావుట్రా?"

—1934 జనవరి

ప్రబుద్ధాంధ్ర